క్లుప్తంగా

ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

తానూరు: మండలంలోని ఉమ్రి(కే), బోరి గాం, తానూరు, బెంబర, బోల్సా, బామ్నితండా, ఝరి(బి)తండా గ్రామాల్లో ఇళ్లు లేని లబ్ధిదారులు ఇంటిస్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల ఒకటో తారీఖు నుంచి రెవెన్యూ అధికారులు పంచాయతీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారన్నారు. మూడో తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పెంపకందారులకు అవగాహన

ముధోల్: మండలంలోని మచ్కల్‌లో గొర్రెలు, మేకల పెంపకం అభివృద్ధి పథకంపై బుధవారం పెంపకందారులకు అవగాహన కల్పించారు. వెటర్నరీ సర్జన్ రవీందర్, ఎంపీడీవో సురేశ్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సర్పంచ్ అశ్విని మైసాజీ తదితరులు పాల్గొన్నారు.

సొంత డబ్బులతో మోటార్ ఏర్పాటు


మోటార్ ప్రారంభిస్తున్న నాయకులు

ఖానాపూర్: పట్టణంలో ఐదోవార్డు పరిధిలోని ఇంద్రనగర్‌లో నీటి సమస్య పరిష్కరించాలని కౌన్సిలర్ పరిమి లత, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు పరిమి సురేశ్ దృష్టికి కాలనీవాసులు తీసుకెళ్లారు. వారు స్పందించి ఇటీవల బోరు వేయించగా బుధవారం సొంతంగా రూ.30వేలు ఖర్చు చేసి మోటార్ ఏర్పాటు చేశారు. కాలనీవాసుల ఇళ్లకు నీరు వెళ్లేలా ఏర్పాట్లు చేయించారు. దీంతో కౌన్సిలర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కంటివెలుగు ప్రారంభం

పెంబి: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో బుధవారం కంటివెలుగు శిబిరాన్ని ఎంపీపీ కవిత, సర్పంచ్ పూర్ణచందర్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ స్వప్నిల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ఎంపీవో రత్నాకర్‌రావు, పెంబి పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

చదువుతోనే గౌరవం, గుర్తింపు


విద్యార్థిని సన్మానిస్తున్న రామారావుపటేల్

భైంసా: చదువుతోనే సమాజంలో గౌరవం, గుర్తింపు సాధ్యమని విద్యార్థులు ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని అనసూయ పవర్ ట్రస్ట్ చైర్మన్ పవర్ రామారావ్ పటేల్ అన్నారు. భైంసాలోని తన నివాసంలో బుధవారం పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన 51 మంది విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ సుభాష్, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారావు, ఉపాధ్యాయులు గంగాధర్, శ్రీనివాస్, వందన, వేదం పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు ప్రదానం

కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామంలోని సీఎస్‌ఐ చర్చిలో సమ్మర్ ఒకేషనల్ కోర్సుగా బైబిల్ పఠనం నేర్పించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన చిన్నారులకు మండల కేంద్రానికి చెందిన చిన్నారి స్వచ్ఛంద సంస్థ చైర్మన్ పాల్ కరుణాకర్ టిఫిన్ బాక్స్‌లను బహుమతులుగా అందించారు. కార్యక్రమంలో చర్చి రేవరెండ్ ప్రభాకర్, అడ్వకేట్ జాకబ్ తదితరులు ఉన్నారు.

జీలుగ విత్తనాలు పంపిణీ


విత్తనాలు అందిస్తున్న నాయకులు

సోన్: మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలను సర్పంచ్ వినోద్‌కుమార్, ఆత్మ చైర్మన్ గంగారెడ్డి పంపిణీ చేశారు. 30కిలోల బ్యాగు ధర రూ.843 ఉందని.. కావాల్సిన రైతులు పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఆధార్‌తో మండలకేంద్రంలోని రైతువేదికలో రసీదు తీసుకొని ఆగ్రోస్‌లో విత్తనాలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఇన్‌చార్జి మండల వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్ జీలుగ పంటపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లింగవ్వ, ముత్తన్న, ఉపసర్పంచ్ రాజేశ్వర్, మార్కెట్ డైరెక్టర్ బుచ్చన్న, అంబేకర్ ప్రసాద్, ఏఈఓలు అంబాజీ, రజని, అశోక్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ప్రయాణం.. ప్రమాదకరం!

- కంకర తేలి గుంతలమయంగా పల్లె రోడ్లు
- రాకపోకలకు ప్రయాణికుల ఇబ్బందులు
- మరమ్మతులు చేయించాలని వేడుకోలు


కన్యపూర్-ఆష్టా రోడ్డుపై ఏర్పడిన గుంత


సేవాలాల్ తండా నుంచి నర్సింహనగర్ తండాకు వెళ్లే రోడ్డు దుస్థితి

లోకేశ్వరం: మండలంలో పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు కంకర తేలి అధ్వానంగా మారాయి. దీంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. 15 ఏళ్ల కిందట నిర్మించిన సేవాలాల్ తండా–నర్సింహనగర్ తండా రోడ్డు, కన్యపూర్–ఆష్టా రోడ్డు, రాయపూర్‌కాండ్లీ– ఎడ్‌బిడ్ రోడ్లు ప్రమాదకరంగా మారాయి. గుంతలు తేలిన ఈ రోడ్లపై ప్రయాణం సాగించేందుకు వాహనదారులు జంకుతున్నారు.

మరమ్మతులు కరువు..

ఈ మూడు రోడ్లు గతంలో కురిసిన వర్షాలకు కోతకు గురయ్యాయి. చిన్నపాటి వర్షం కురిసినా గుంతల్లో నీరు నిలుస్తుండటంతో రోడ్డు కన్పించక ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కింద పడుతున్నారు. తమ వాహనాలు సైతం తరచుగా మరమ్మతులకు గురవుతున్నాయని ప్రైవేటు వాహనదారులు వాపోతున్నారు. రాత్రివేళ ఈ రోడ్లపై ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని.. మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

ఈ రోడ్లపై నిత్యం ఎందరో అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రయాణిస్తున్నా.. మరమ్మతులు చేయించడం లేదని వాహనదారులు వాపోతున్నారు. గతంలో నామమాత్రంగా మరమ్మతులు చేయించినా.. ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్లపై కేజీవీల్స్ ట్రాక్టర్లు నడవడంతో అధ్వాన స్థితికి చేరాయి. ఈవిషయమై అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



మా గ్రామంలోని రోడ్డు కంకర తేలి అధ్వానంగా మారింది. రాత్రి ప్రయాణించాలంటే భయమేస్తోంది. అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి.

– గోవింద్, రాయపూర్‌కాండ్లీ

అధికారులు స్పందించాలి



ఈరోడ్డుపై కంకర తేలి గుంతలు పడ్డాయి. రాత్రి ప్రయాణించాలంటే నరకం కనబడుతోంది. అధికారులు స్పందించాలి. వర్షాకాలంలో పరిస్థితి ఘోరంగా ఉంటుంది.

– వెంకట్‌రెడ్డి, వాస్తాపూర్

ప్రతిపాదనలు పంపించాం

మండలంలోని సేవాలాల్‌తండా–నర్సింహనగర్, కన్యపూర్–ఆష్టా రోడ్లకు మరమ్మతులు చేయించేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం. ప్రజలకు ఇబ్బంది కాకుండా చూస్తాం.

– రఘువంశీ, పీఆర్ జేఈ, లోకేశ్వరం

కిచెన్‌గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలి


చింతల్‌చాంద సమావేశంలో సీడీపీవో నాగమణి


కుభీర్‌లో..


ఖానాపూర్: పనుల ప్రారంభంలో అధికారులు


ముధోల్‌లో ప్రారంభిస్తున్న అధికారులు

లక్ష్మణచాంద: అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు ఇంటింటా కిచెన్‌గార్డెన్లు ఏర్పాటు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో నాగమణి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని చింతల్‌చాంద అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కిచెన్‌గార్డెన్‌ల ఏర్పాటుతో తాజా కూరగాయలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల వివరాలను ఆన్‌లైన్‌లో ఎలా పొందుపర్చాలో వారికి ప్రత్యక్షంగా చూపించారు. అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించడంతోపాటు దశాబ్ది ఉత్సవాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యవతి, పోషణ్ అభియాన్ అధికారి రాము, గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ముధోల్: ప్రతి ఇంట్లో కిచెన్‌గార్డెన్ ఏర్పాటు చేసుకొని తీగజాతి కూరగాయలు, ఆకుకూరలు నాటుకోవాలని ఎంపీడీవో సురేశ్‌బాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో కిచెన్‌గార్డెన్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు అఫ్రోజ్‌ఖాన్, ఎంపీపీ అమీర్‌ఖాన్, ముధోల్ సర్పంచ్ రాజేందర్, ఎంపీటీసీ భూమయ్య తదితరులు ఉన్నారు.

కుంటాల: మండలంలోని ఓలా, అందకూర్ గ్రామాల్లో బుధవారం పంచాయతీ ఆధ్వర్యంలో కిచెన్‌గార్డెన్‌లను ఏర్పాటు చేసి విత్తనాలు చల్లారు. ఈ సందర్భంగా ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి గ్రామస్తులతో మాట్లాడారు. ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఇంటి వద్ద కిచెన్‌గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కనీష్‌ఫాతిమా, ఏపీవో గట్టుపల్లి నవీన్, ఎంపీవో రహీం, ఐసీడీఎస్ సీడీపీవో నాగలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మీ విశారథ, ఏపీఎం భోజన్న, తదితరులు పాల్గొన్నారు.

కుభీర్: మండల కేంద్రంలో స్త్రీశక్తి భవనం పక్కన ఖాళీ స్థలంలో కిచెన్‌గార్డెన్(పెరటి తోట)ను ఎంపీడీవో లింబాద్రి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి.. సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలు తినాలని సూచించారు. మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో కిచెన్‌గార్డెన్లు ఏర్పాటు చేస్తామని ఎంపీడీవో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీవో కవిరాజు, ఏపీవో హరిలాల్, కార్యదర్శులు, ఐకేపీ, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

తానూరు: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో కిచెన్‌గార్డెన్‌ను ఎంపీడీవో శ్రీనివాస్ ప్రారంభించారు. కిచెన్‌గార్డెన్‌లో వివిధ రకాల కూరగాయల పెంపకం చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో మోహన్‌సింగ్, ఈజీఎస్ ఏపీవో గంగాధర్, టీఏలు రమణగౌడ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సోన్: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం, న్యూవెల్మల్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఇన్‌చార్జి ఎంపీడీవో మోహన్‌రెడ్డి కిచెన్‌గార్డెన్ ప్రారంభించారు. ఈసందర్భంగా వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయల విత్తనాలు నాటారు. అనంతరం న్యూవెల్మల్‌లో నీటిగుంత పనులు పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఓ మంజులరెడ్డి, ఐకేపీ ఏపీఎం గంగామణి, ఎంపీటీసీ నాగయ్య, ఉపసర్పంచ్ గడ్డం స్వామి, ఎఫ్ఏ లక్ష్మణ్, టీఏ సంధ్య, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఖానాపూర్: మండలంలోని బాదన్‌కుర్తి పంచాయతీ పరిధిలోని చింతల్‌పేట్ గ్రామంలో దత్తాత్రేయస్వామి ఆలయం వద్ద బుధవారం సామూహిక ఇంకుడుగుంత పనులను ఎంపీడీవో మల్లేశ్ ప్రారంభించారు. అనంతరం పల్లె ప్రకృతివనం ఆవరణలో కిచెన్‌గార్డెన్ ఏర్పాటు చేసి విత్తనాలు చల్లారు. కార్యక్రమంలో సర్పంచ్ పార్శపు శ్రీనివాస్, శనిగారపు శ్రావణ్, ఎంపీవో చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

పొగాకు ఉత్పత్తులు వినియోగించొద్దు

- డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజేందర్


నిర్మల్‌లో ర్యాలీలో పాల్గొన్న వైద్యసిబ్బంది

నిర్మల్‌చైన్‌గేట్: పొగాకు ఉత్పత్తులు వినియోగించి రోగాల బారిన పడొద్దని డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజేందర్ అన్నారు. బుధవారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రాంనగర్ ఆధ్వర్యంలో 'ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం' పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో 'మాకు ఆహారం కావాలి పొగాకు కాదు' అనే నినాదంతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులు వాడితే నోటి క్యాన్సర్, బ్రెయిన్ క్యాన్సర్, టీబీ గుండె జబ్బుల బారిన పడతారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్ నాగేశ్వరరావు, సూపర్‌వైజర్లు మతీన్, రమణ, పద్మ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశవర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

భైంసాటౌన్: ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని భైంసాలో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా ఆస్పత్రి నుంచి బస్టాండ్ మీదుగా ర్యాలీ తీసి పొగాకుతో కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో కలిమొద్దీన్, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడుగుంత పరిశీలన

లక్ష్మణచాంద: వర్షపునీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచేందుకు ఇంకుడుగుంతలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీపీ అడ్వాల పద్మ పేర్కొన్నారు. బుధవారం లైఫ్ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఇంకుడుగుంతను వారు పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో వీటిని నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీడీవో శేఖర్, డీటీ గంగాధర్, ఏవో ప్రవీణ్, ఎంపీవో నసీరుద్దీన్, డిప్యూటీ ఎఫ్‌ఆర్వో నజీర్‌ఖాన్ పాల్గొన్నారు.

చెక్కులు అందజేత

ముధోల్: మండల కేంద్రంలో బుధవారం పలువురు లబ్ధిదారులకు రూ.37,500 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు అఫ్రోజ్‌ఖాన్ అందజేశారు. సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి


లక్ష్మణచాందలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మ


సోన్: మాట్లాడుతున్న అధికారి

లక్ష్మణచాంద: మండలంలోని గ్రామపంచాయతీల్లో ఈనెల 2 నుంచి 22వ తేదీ వరకు దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీపీ అడ్వాల పద్మ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలోని ఎంపీపీ పద్మ తన చాంబర్‌లో సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, కార్యదర్శులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గంగాధర్, ఎంపీడీవో శేఖర్, ఎంపీవో నసీరుద్దీన్, డిప్యూటీ ఎఫ్‌ఆర్వో నజీర్‌ఖాన్, ఏపీఎం వాణిశ్రీ, ఎంపీవో ప్రమీల, ఏవో ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో బుధవారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాలపై ఎంపీడీవో మల్లేశ్ మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈనెల 2 నుంచి 22వ తేదీ వరకు జరిగే ఉత్సవాలను రోజు ఘనంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎంపీపీ మోహిద్, వైస్‌ఎంపీపీ వాల్‌సింగ్, తహసీల్దార్ రాజమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సోన్: దశాబ్ది ఉత్సవాల సందర్భంగా చేపట్టనున్న ఏర్పాట్లపై ఎంపీడీవో సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ హిమబిందు, ఏపీఎం ఖలీల్, హైమద్, ఏపీఓ మంజులరెడ్డి, ఐకేపీ ఏపీఎం గంగామణి, అధికారులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్ – రెయిలింగ్ ఏర్పాటు చేయరూ..



కడెం: మండలంలోని పాండ్వపూర్ గ్రామ సమీపంలోని వంతెనకు ఇరువైపులా నూతనంగా ఏర్పాటు చేసిన రోడ్డుకు రక్షణ చర్యలు లేకపోవడంతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా రక్షణగా రెయిలింగ్‌ను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: మల్లారెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈ, ఫోన్: 94906 51358

వర్షాకాలంలో ఇబ్బందులు రానివ్వం

- మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో చైర్మన్ ఈశ్వర్


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: రానున్న వర్షాకాలంలో పట్టణ ప్రజలు ఇబ్బంది పడకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎజెండాలోని అంశాలను చర్చించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ గతేడాది కురిసిన భారీ వర్షాలకు ప్రజలు ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. ఈసారి అలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పట్టణంలోని భారీ మురుగు కాల్వలను శుభ్రం చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. ధర్మసాగర్ చెరువులో వాకింగ్ ట్రాకింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సహకారంతో పట్టణంలోని 42 వార్డులను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 4న సీఎం కేసీఆర్ జిల్లాకు రానున్నారని.. వారిని కలిసి పట్టణ అభివృద్ధికి రూ.100 కోట్ల నిధులు మంజూరు చేయాలని విన్నవిస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, పలువురు కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం చెల్లించాలి


నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడెం: గతేడాది కడెం ప్రాజెక్ట్ వరదలతో భూములు దెబ్బతిన్న రైతాంగానికి ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని ఏఐసీసీ రిసెర్చ్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్‌నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో రైతులతో కలిసి నిరసన దీక్ష చేపట్టారు. వరదల కారణంగా మండలంలోని పాండ్వపూర్ తదితర గ్రామాల రైతుల భూములు సాగుకు పనికి రాకుండా పోయాయని పేర్కొన్నారు. ఈనెల 4న నిర్మల్ పర్యటనలో సీఎం కేసీఆర్ బాధిత రైతులకు పరిహారం ప్రకటించి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు శంతన్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, సతీశ్‌రెడ్డి, రహీం, సత్యం, శంకర్, సలీం, తదితరులు ఉన్నారు.

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి


కుంటాలలో ధాన్యం పరిశీలిస్తున్న పద్మ

కుంటాల: తూకం వేసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు తరలించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బొప్పని పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కుంటాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. అకాల వర్షాలతో ధాన్యం బస్తాలు తడవడం వలన రైతులు నష్టపోతున్నారన్నారు. లారీలు రాక కేంద్రాల వద్ద రైతులు నిరీక్షించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని.. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. వారి వెంట జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు మురళీమోహన్ తదితరులు ఉన్నారు.

అహల్యాబాయిని ఆదర్శంగా తీసుకోవాలి


తానూరులో నివాళులర్పిస్తున్న నాయకులు

తానూరు: మహ్మదీయుల దాడుల్లో దెబ్బతిన్న కాశీ, ద్వారక, మధుర, ఉజ్జయిని, రామేశ్వరం, అయోధ్య, హరిద్వార్ పుణ్యక్షేత్రాలను పునర్ నిర్మించిన రాజమాత అహల్యాబాయిను ఆదర్శంగా తీసుకోవాలని సర్పంచ్ తాడేవార్ విఠల్ అన్నారు. బుధవారం మండలంలోని తానూరు, దాగాం గ్రామాల్లో నిర్వహించిన రాజ్యమాత అహల్యాబాయి జయంతి వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. దాగాంలో విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రాములు, మాధవ్‌రావ్ పటేల్, పుండలిక్ తదితరులు పాల్గొన్నారు.

ముధోల్‌లో..

ముధోల్: మండల కేంద్రంలోని ధన్గర్‌గల్లీలో బుధవారం రాజమాత అహల్యాబాయి హోల్కర్ 298వ జయంతిని కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సాయినాథ్, కోలేకర్ శంకర్, నగేశ్, భోజారాం పాల్గొన్నారు.

ఈరోజు

విగ్రహ ప్రతిష్ఠాపన

భైంసాటౌన్: పట్టణంలోని గణేశ్‌నగర్‌లో వీర హనుమాన్ ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్లు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేస్తామని.. భక్తులు తరలి రావాలని కోరారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన

ఖానాపూర్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వినూత్న నిరసన చేపట్టనున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖానాపూర్, కడెం ఆయకట్టు రైతులకు ప్రత్యేక కెనాల్‌తోపాటు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తామని సీఎం ఇచ్చిన హామీలను గుర్తు చేసేందుకే కార్యాలయ ఆవరణలో కుర్చీ వేసుకొని నిరసన చేపడుతామని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే రాక

లోకేశ్వరం: మండలంలోని ఎడ్దూర్-పొట్‌పల్లి గ్రామంలో గురువారం ఉదయం తొమ్మిది గంటలకు శివాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి భూమిపూజ చేస్తారని బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ శ్యాంసుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు.

గడపగడపకూ బీజేపీ

ముధోల్: మండలంలోని విఠోలిలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మోహన్‌రావుపటేల్ పాల్గొన్నారు. గడపగడపకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా ఆయన విఠోలిలో రచ్చబండ నిర్వహించి గ్రామస్తుల సమస్యలు తెలుసుకున్నారు.